క్లుప్తంగా

బాలాంజనేయుని ఆలయ వార్షికోత్సవం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. స్థానిక పాతమల్లాయపాలెం రోడ్డులో ఉన్న ఆలయంలో ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాలాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పన ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడుతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కొండపాటూరు(కాకుమాను): నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శంకర కంటి ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ శ్రీనిజ అన్నారు. మండలంలోని కొండపాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యార్లగడ్డ అంకమ్మ చౌదరి, రామయ్య చారిటీస్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారితో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనిజ మాట్లాడుతూ.. నేత్రాల పట్ల అశ్రద్ధ చూపకూడదని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎలాంటి కంటి సమస్యలున్నా ఉచితంగా వైద్యం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 272 మంది వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. వారికి రెండు రోజుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘన, చారిటీస్ అధ్యక్షులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, సభ్యులు గన్నవనేని రాఘవరావు, గాంధీ, శ్రీనివాసరావు, హనుమంతరావు, కె.రామారావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు వాసికి అవార్డు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరుకు చెందిన పారిశ్రామికవేత్త చిరుమామిళ్ల మల్లికార్జునరావుకు ప్రముఖ మీడియా సంస్థ దైనిక్ భాస్కర్ ఆసియా అవార్డ్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్–2025 అవార్డును ప్రదానం చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మైనింగ్ విభాగంలో రాణిస్తున్నందుకు పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ ఆపరేషన్ హెడ్, జనరల్ మేనేజర్ అయిన చిరుమామిళ్ల మల్లికార్జునరావుకు మలేసియాలో దైనిక్ భాస్కర్ ప్రతినిధులు ఈ అవార్డు ప్రదానం చేశారు. తమ ప్రాంత వాసి అవార్డు అందుకోవడం పట్ల వట్టిచెరుకూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు అల్పాహారం పంపిణీ

లక్ష్మీపురం: బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ క్రీడాకారులకు అల్పాహారాన్ని బోటనీ ఉపాధ్యాయులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవుల సందర్భంగా సమ్మర్ క్యాంప్‌లలో క్రీడా శిక్షణకు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో బోటనీ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లాల్ వజీర్, శ్రీనివాస్, లక్ష్మి, హరిబాబు, వీర రత్నం, లంక మాధవి, ధర్మ కిషోరి పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ గాత్ర సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో గందూరి నాగేశ్వరరావు శాస్త్రీయ గాత్ర సంగీత కచేరి నిర్వహించారు. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో జరిగాయి. భైరవి రాగమో విరిబోణి, షణ్ముఖ ప్రియా రాగంలో సిద్ది వినాయకం వంటి వాగ్గేయకారుల కీర్తనలను అలపించారు. వయోలిన్‌పై పి.నాగేశ్వరరావు(విజయవాడ), మృదంగంపై కుందుర్తి అరవింద్(చెన్నై) వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను ఉపాధ్యక్షులు గిరిజా శంకర్ సత్కరించారు.

‘పన్ను’పోటుకు రంగం సిద్ధం

- పట్టణ వాసులపై పెరగనున్న 20 శాతం ఆస్తిపన్ను భారం
- పన్ను ఎగవేతదారులే లక్ష్యమంటున్న అధికారులు
- జూన్ 15 నాటికి ఇంటింటా కొలతలు పూర్తి



ఇంటి వద్ద కొలతలు సేకరిస్తున్న సచివాలయం సిబ్బంది

పొన్నూరు: పట్టణ వాసులపై వివిధ రకాలుగా ఆస్తిపన్ను భారం పెంచేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధమైంది. ఆస్తి, కొళాయి, ఖాళీ స్థలాలు వంటి పన్నుల ఎగవేతను అడ్డుకొని పక్కాగా పన్ను వసూలు చేయడమే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. కొలతల ఆధారంగా ఉన్న డిమాండ్‌పై అదనంగా 20 శాతం ఆదాయం సమకూర్చుకునేందుకు కార్యాచరణ జరుగుతోంది. వచ్చేనెల 15వ తేదీలోగా ఇంటింటా కొలతలు పూర్తి చేసి అదనపు ఆదాయం సమకూర్చుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే..

కొందరు భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించి ఆస్తి పన్ను ఎగ్గొడుతున్నారు. మరికొందరు కొళాయి కనెక్షన్ ఉన్నా నీటి పన్ను చెల్లించడంలేదు. అలాంటి వారందరినీ గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకురావడమే ఈ సర్వే ఉద్దేశం. ప్రస్తుతం ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు రీసర్వే పేరిట చేపట్టిన కొలతలు పూర్తయితే 20 శాతం వరకు పెంచిన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికీ పన్ను భారం అదనంగా పడనుంది. పొన్నూరు పురపాలక సంఘంలో చాలా వరకు ఆస్తులకు అసెస్‌మెంట్లు లేవని.. మరికొందరు ఒక అంతస్తు నిర్మాణానికి అనుమతి తీసుకుని రెండు, మూడు అంతస్తులు నిర్మించారని అధికారులు గుర్తించారు. ఇందుకు సర్వే చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అదనపు ఆదాయమే లక్ష్యంగా..

పొన్నూరు పట్టణంలో ప్రస్తుతం ఆస్తిపన్ను అసెస్‌మెంట్లు 11,662 ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరానికీ రూ.5.70 కోట్ల ఆదాయం సమకూరుతోంది. చెల్లింపుదారుల నుంచి 20 శాతం పెంచి మరో రూ.1.12 కోట్లు రాబట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 15 నుంచి వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటా సర్వే పూర్తి చేస్తున్నారు. సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లు, రెవెన్యూ ఉద్యోగుల ద్వారా ఈ సర్వే పూర్తి చేయనున్నారు. ఇళ్లు, భవనాలు, దుకాణాలకు ఆస్తిపన్ను చెల్లిస్తున్నారా.. లేదా అనే అంశాన్ని పరిశీలిస్తారు. ఖాళీ స్థలాల పన్నులపైనా సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వే ఆధారంగా పన్నులు వసూలు చేస్తారు. సర్వే పూర్తయితే పట్టణంలో 50 శాతం మందిపై అదనపు భారం పడనుంది.



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

రూ.1.12 కోట్ల ఆదాయం పెంచడమే లక్ష్యం..



ఈనెల 15వ తేదీ నుంచి ఇంటి పన్నుకు సంబంధించి కొలతలు తీసుకుంటున్నాం. ఈ ఒక్క నెలలోనే రూ.1.12 కోట్ల ఆదాయం పెంచడమే లక్ష్యం పెట్టాం. మున్సిపాలిటి పరిధిలో ఆస్తి పన్నులు అన్నింటిపైనా సర్వే చేపడుతున్నాం. పన్నులు ఎగవేసే వారిని గుర్తించి వారి నుంచి పన్నులు వసూలు చేయడమే లక్ష్యం. చాలా మంది ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించడం లేదు. ఇంటి పన్ను ద్వారా వ్యాపారాలు నిర్వహించడం వంటి వాటిపై దృష్టి సారించాం.

–తోట వెంకటేశ్వరరావు, ఆర్‌ఓ, మున్సిపాలిటి, పొన్నూరు

ప్రజా ఉద్యమాల వైపు కళాకారులు పయనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అజయ్‌కుమార్

లక్ష్మీపురం: దేశంలో సమాజ పురోగమనానికి ప్రజా కళలు అత్యంత స్ఫూర్తినిస్తాయని, ప్రజా ఉద్యమాల వైపు పయనించాలని సీపీఐ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర బాధ్యులు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అఖిల భారత ప్రజానాట్యమండలి 83వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. తొలుత సంఘం జెండాను సీనియర్ కళాకారుడు సిహెచ్.కృష్ణ ఆవిష్కరించారు. విప్లవ సినిమా నటుడు మాదాల రంగారావు జయంతి సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్ అధ్యక్షతన వహించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఎంత బలపడితే కమ్యూనిస్టు పార్టీలు అంత బలంగా ఉంటాయని గుర్తు చేశారు. నేడు ప్రజానాట్యమండలి కూడా నాటిక పోటీలు నిర్వహించి ప్రజానాట్యమండలి మరింత బలం చేకూర్చే పద్ధతులలో కళాకారులు తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అఖిలభారత ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సీనియర్ గాయకులు సిహెచ్.కృష్ణ, పులి సాంబశివరావు, గుంటూరు కళా పరిషత్తు వ్యవస్థాపకులు పూర్ణ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఆరేటి రామారావు, ఆర్.పిచ్చయ్య, మహంతి లక్ష్మణరావు, నజీర్, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

గుండెజబ్బులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్

లక్ష్మీపురం: మన శరీరంలో అతి ముఖ్యమైన భాగాలలో ఒకటైన గుండె పనితీరును ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆకుల శివప్రసాద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా చిన్న వయసులో వారు కూడా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చెడు ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, దురవేసనాలు అన్నారు. రోజు కనీసం ఒక గంట వ్యాయామం చేస్తూ మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండాలన్నారు. మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గుండెపోటు వచ్చిన వారిలో నీరసం రావడం, చెమటలు పట్టడం ఎడమ చేయి లాగడం విరోచనం కావడం, చాతిలో బరువుగా ఉండటం లాంటి లక్షణాలు కనబడతాయని అలాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స చేయించుకుంటే మంచిదన్నారు. ఈ సందర్భంగా అవగాహన సభ్యులు డాక్టర్ ఆకుల శివప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి కోఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, జేకేసీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు, విద్యావేత్త ఈ.చంద్రయ్య పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ చిత్తడే.. చిత్తడి

- వాకర్లకు తప్పని ఇబ్బందులు
- వెంటాడుతున్న కిక్కులు
- పిల్లలను తీసుకొచ్చేందుకు తల్లిదండ్రుల ఆందోళన



వాకింగ్ ట్రాక్‌లో వర్షపు నీరు నిల్వ చేరి బురదమయంగా మారిన దృశ్యం

లక్ష్మీపురం: ఎన్‌టీఆర్ స్టేడియం చినుకు పడితే చాలు వాకింగ్ ట్రాక్, ప్రాంగణం అంతా బురదమయంగా మారుతోంది. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంది. ఈ స్టేడియంలో రాను రాను అధికారులు వసతులు కల్పించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ స్టేడియంకు నగర పరిధిలోని ఈస్ట్, వెస్ట్ నియోజక వర్గాలకు చెందిన ఆయా ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు, క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు వస్తుంటారు. ఇలాంటి స్టేడియాన్ని నగరపాలక సంస్థ అధికారులు ఎన్నో రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించి నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంది. కాని దీనికి భిన్నంగా ఈ స్టేడియంలో వాకింగ్ చేసే వాకింగ్ ట్రాక్ చుట్టూ శునకాలు సంచరిస్తు ఉండటం వల్ల వాకింగ్ చేసే వారికి అసౌకర్యంగా మారింది. కొన్ని సందర్భాలలో అయితే కుక్కలు స్టేడియంలో వాకింగ్ చేసే వారి వెంట పడిన ఘటనలు ఉన్నాయి. అయితే స్టేడియంలో కుక్కలు తిరుగుతుండటంతో చిన్నారులను స్టేడియానికి తీసుకు వచ్చేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ రోజు స్టేడియంలో వాకింగ్ చేయలేని దుస్థితి ఏర్పడిందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురదమయంగా...

ఎన్‌టీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేయక పోవడంతో వర్షం కురిస్తే చాలు వాకింగ్ ట్రాక్ అంతా బురదమయంగా మారుతోంది. వర్షం కురవడం వలన వాకింగ్ ట్రాక్ దారి మధ్యలో వర్షం నీరు నిల్వ చేరింది. ఇదిలా ఉంటే ఈ ట్రాక్ ఎత్తు పల్లాలుగా ఉండటం, వాకింగ్ ట్రాక్ నెల గట్టిగా ఉండటంతో వృద్ధులు వాకింగ్ చేయాలంటే మోకీలు నొప్పులు అధికం అవుతాయని అంటున్నారు. వర్షం కారణంగా వాకర్స్ వాకింగ్ ట్రాక్‌కు బదులు బాస్కెట్ బాల్, స్కేటింగ్ కోర్టుల చుట్టు వాకింగ్ చేయాల్సిన దుస్థితి ఏర్పందని అంటున్నారు.

ముగియనున్న సమ్మర్ క్యాంప్...

ఇటీవల చిన్నారుల పాఠశాలలకు సమ్మర్ సెలవులు ప్రకటించడంతో నగర వాసులు వారి పిల్లలను పలు క్రీడా శిక్షణ శిబిరం అయిన సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ కల్పించేందుకు ఆసక్తి కనబరిచారు. అయితే ప్రతి క్రీడా శిక్షణకు ఫీజును ఏర్పాటు చేశారు. అయితే వారం రోజులుగా వర్షం కురవడం వల్ల అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, స్కేటింగ్ వంటి వాటికి చిన్నారులను తీసుకు రాలేదని దుస్థితి ఏర్పడిందని నెల రోజుల శిక్షణ శిబిరం 5 రోజుల్లో పూర్తి కానుందని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన ర్యాలీ



గుంటూరు మెడికల్: బ్రెయిన్ ట్యూమర్ అవగాహన మాసం సందర్భంగా ఆదివారం గుంటూరు నగరంలో న్యూరో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ తారక్‌నాథ్ మాట్లాడుతూ బ్రెయిన్ ట్రోమర్‌ల లక్షణాలు ప్రారంభ దశలో కనిపించకపోవచ్చన్నారు. వాటిని సమయానికి గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. న్యూరోసర్జన్ డాక్టర్ వుప్పుటూరి హేమంత్ మాట్లాడుతూ తలనొప్పి, వాంతులు వంటి చిన్న లక్షణాలను అశ్రద్ధ చేస్తే పెద్ద సమస్యలకు దారితీస్తాయన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ అంజిత్ వుప్పుటూరి మాట్లాడుతూ బ్రెయిన్ ట్రోమర్లపై మరింత పరిశోధన జరగాలని కోరారు. న్యూరాలజిస్టులు డాక్టర్ పవన్‌కుమార్ చెరుకూరి, డాక్టర్ నవీన్ వందనపు, డాక్టర్ హరితా చౌదరి, డాక్టర్ లక్ష్మీప్రియా చదలవాడ మాట్లాడుతూ బ్రెయిన్ ఆరోగ్య మన జీవనశైలిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. వైద్య నిపుణులు రోగులు, వారి కుటుంబ సభ్యుల మధ్య మద్దతు కలిగి ఉండాలన్నారు. బ్రెయిన్ ట్రోమర్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రాణాలు పోకుండా కాపడవచ్చున్నారు. బృందావనం గార్డెన్స్ ఎన్‌టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉచిత బియ్యం పంపిణీ అభినందనీయం

నగరంపాలెం: గత 25 ఏళ్లుగా వాసవిక్లబ్ గుంటూరు, ఉచిత బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమని వాసవి క్లబ్ అంతర్జాతీయ నాయకులు మాడా వెంకటసుబ్బారావు అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్తంగా ఆదివారం 108 మంది వృద్ధులకు ఉచితంగా బియ్యం, పింఛన్లను ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. మే నెల బియ్యం పంపిణీకి కొత్తూరు వెంకటనరసింహారావు సహకరించారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖ రరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాయవరపు అనురాధ, ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి విజయలక్ష్మి, కోశాధికారి పరుచూరు చంద్రిక, అఖిల్ పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ఐక్యంగా ఉండాలి



పెదకాకాని: దేశ సమైక్యతకు, మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం పెకకాకానిలో సుందరయ్య భవన్‌లో సమైక్యత సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కశ్మీర్‌లోని పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఆగ్రం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, నాయకులు కె.సత్యనారాయణ, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం, వి.శివయ్య, కె.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మోదీ మొండిచెయ్యి



సమావేశంలో నాయకులు

పెదకాకాని: దేశం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనని పొన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి గాదె నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని.. మొండిచెయ్యి చూపారని ఆయన విమర్శించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండడంపై రాహుల్‌గాంధీ పూర్తి మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు పొన్నూరు నియోజకవర్గంలో నూతన అధ్యక్షులను నియమించామని తెలిపారు. బాపట్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా గడ్డం పాల్ విజయకుమార్, పెదకాకానికి చెందిన షేక్ నాగుల్ మీరా, చేబ్రోలుకు చెందిన వేజండ్ల వరప్రసాదరావు, పొన్నూరు రూరల్‌కు చెందిన అందే దిలీప్‌కుమార్, పట్టణానికి చెందిన తాడిశెట్టి సాంబయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జొన్నల వెంకట రెడ్డి, సబ్బా కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడుకోవాలి

సమైక్యతా యాత్రలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, సీపీఎం నగర కార్యదర్శి నళినికాంత్

లక్ష్మీపురం: కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ఐక్యతా స్ఫూర్తిని రానున్న కాలంలోనూ కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. దేశంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. పహల్గాం దాడి, అనంతరం పాక్‌పై యుద్ధం, అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో సమైక్యతా యాత్ర నిర్వహించారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకూ నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల నుంచి పర్యాటకుల్ని రక్షించటంలో కశ్మీర్ ప్రజలు మతాలకు అతీతంగా ఉన్నారన్నారు. అయితే ఈ దాడిని అడ్డుపెట్టుకొని దేశంలోని కొన్ని శక్తులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. అమెరికా తన ఆధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందని, అమెరికాకు మోదీ లొంగిపోవటం సరికాదన్నారు. భారత దేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం అన్నారు. సీపీఎం నాయకులు ఎండీ సలీం మాట్లాడుతూ పహల్గాం దాడి తర్వాత బీజేపీ మంత్రులు ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసే ప్రయత్నం చేశారన్నారు. నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.అరుణ, కె.అజయ్ కుమార్, బి.ముత్యాలరావు, లక్ష్మణరావు, సత్యనారాయణ, కె.శ్రీనివాస్, జి.రమణ పాల్గొన్నారు. ప్రదర్శనలో చిన్నారులు దేశభక్తి పాటలకు కోలాటం వేస్తూ పాల్గొన్నారు.

రేపటి తరం దర్జీలకు ఆదర్శప్రాయం



కేశవరావు, విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: ఐదు దశాబ్దాల క్రితం దర్జీ వృత్తిని దైవంగా భావించి, అంకిత భావంతో ఖాతాదారుల మన్ననలు, అభిమానం పొందారని నవ్యాంధ్ర ప్రదేశ్ టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు యర్రంశెట్టి వాలేశ్వరరావు అన్నారు. మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కిరణ్ టైలర్స్ వ్యవస్థాపకులు పర్చూరి కేశవరావు దర్జీ వృత్తిలో యాభై ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా స్వర్ణోత్సవాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వాలేశ్వరరావు మాట్లాడుతూ కేశవరావు వర్తమాన, రేపటి తరం దర్జీలకు ఆదర్శప్రాయమని అన్నారు. ఫ్యాషన్ ఒక కళ అని, దర్జీ ఒక మంచి కళాకారుడని పేర్కొన్నారు. రెడీమేడ్ దుస్తుల సునామీలో దర్జీ వృత్తి నానాటికి కుంచించుకుపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. దర్జీ వృత్తిదారులను గుర్తించి, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సభకు జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోయ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం కేశవరావు, విజయలక్ష్మి దంపతులను జ్ఞాపికలతో సత్కరించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల లేడీస్ ఫ్యాషన్ డిజైనర్ పేరిశెట్టి శిరీష, పి.కిరణ్, ఆడిటర్ కళ్యాణ్‌చక్రవర్తి, కానుగుల నాగేశ్వరరావు, పి.మాధవరావు, వేల్పూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన



ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకంలో సన్నివేశం

తెనాలి: కళాసాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం ‘జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్’ ప్రదర్శించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఆదివారం రాత్రి ప్రదర్శించిన ఈ చారిత్రక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక, సంయుక్తంగా ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్యమండలి కళాకారులు 60 మంది నటులు పాత్రోచితంగా నటించారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య ప్రదర్శనా సహకారం అందించారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించటం మరో విశేషం. ప్రారంభ కార్యక్రమంలో శివాజీ స్మారక సమితి గౌరవాధ్యక్షుడు డీఎల్ కాంతారావు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, బీజేపీ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక బాధ్యులు పర్యవేక్షించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా జూన్ 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జనసమీకరణకు ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు.

జీవన విధానంలో మార్పులు రావాలి



రక్తపరీక్షలు చేయించుకున్న వాకర్స్

తెనాలిఅర్బన్: వ్యక్తిగత జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని డాక్టర్ అమర్‌నాథ్ పేర్కొన్నారు. చినరావూరు పార్కు వాకర్స్ అసోసియేషన్ తెనాలి అధ్యక్షులు, 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం కలుషితంగా ఉంటుందని చెప్పారు. దీనివలన అనేక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. కనీసం మూడు నెలలకు ఒకసారి వివిధ రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కౌన్సిలర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా చివరి ఆదివారం మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 70 మంది వాకర్స్‌కు వివిధ రకాల రక్తపరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు, కోశాధికారి బి.నరసింహారావు, సుబ్బారెడ్డి, అద్దేపల్లి సాంబశివరావు, గంజి ప్రభాకరరావు, ఓంకార ప్రసాద్, సుభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.